సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



చైతన్యంతో అగ్నిప్రమాదాలకు చెక్

నెల్లూరులోని జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,180
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,643
3శాతం జీఎస్టీతో	రూ.5,812
సవర (8గ్రా)	రూ.46,496

గరిష్టం/కనిష్టం
40.6 /25.9

వాతావరణం

శుక్రవారం వాతావరణంలో 52 శాతం తేమ ఉంది. శనివారం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



మనసు దోచే జరీ అంచు

మహాభారతంలో పదిహేను పర్వాలు రచించి కీర్తిని ఆర్జించిన మహాకవి తిక్కన జన్మస్థలం పాటూరు. ఇక్కడి నేత చీరలు సాధారణ మహిళల నుంచి విశిష్ట మహిళలను సైతం సమ్మోహన పరుస్తాయనడంలో అతిశయోక్తి లేదు. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పాటూరు చీరలకు జాతీయస్థాయిలోనూ ప్రత్యేక గుర్తింపు లభించింది. మగువలు మెచ్చే జరీ డిజైన్లు పాటూరు ప్రత్యేకత.

ఇదీ పాటూరు పట్టు చీరల ప్రత్యేకత

- కాలానుగుణ మార్పులతో మంచి గుర్తింపు
- సౌకర్యం, మన్నిక, అందుబాటు ధరలు
- జాతీయ స్థాయిలోనూ ప్రత్యేక స్థానం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లా కేంద్రానికి 20 కి.మీ దూరంలో ఉండే పాటూరు పట్టు చీరలకు ప్రసిద్ధి. స్వచ్ఛమైన పట్టు, జరీ మిశ్రమంతో నిండైన చీర రూపొందించడం ఇక్కడి కళాకారులకు మగ్గంతో పెట్టిన విద్య. ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన కండికి, పట్టును కలిపి కళాకారులు చీరను తయారు చేస్తారు. చీర, పైట, అంచులను విడివిడిగా నేసి మూడింటిని కలిపే నైపుణ్యం పాటూరు పట్టు కళాకారులది. ప్రకృతి వర్ణాలను సమ్మిళితం చేసి నేసే పాటూరు పట్టు చీరలను సాధారణంగా కట్టుకున్నా మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలుగజేయకుండా ఎంతో తేలిగ్గా ఉంటాయని పేరుంది.

వేసవిలో చల్లగా..

వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చని అనుభూతి నివ్వడం పాటూరు చీరలకున్న మరో ప్రత్యేకత. పాటూరు ప్రాంతంలో దశాబ్దాల క్రితం వంద చేనేత కుటుంబాలు ఉండేవి. కాలానుగుణంగా పెద్ద వ్యాపారులు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో నిపలు ప్రాంతాలకు చెందిన మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడున్న వ్యాపారులు ముడి సరుకును పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి విడివిడిగా మహిళలకు ఇచ్చి చీర నేసే విధంగా



పట్టు చీర నేస్తున్న నేతన్న

ప్రోత్సహిస్తున్నారు. సంప్రదాయానికి ఆధునికీకరణకు పెట్టింది పేరుగా పాటూరు చీరలకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

శతాబ్దాల చరిత్ర..

పాటూరు చేనేత చీరలకు దాదాపు వంద సంవత్సరాల చరిత్ర ఉంది. పాటూరు చీరలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. పెన్నానది పరీవాహక ప్రాంతమైన పాటూరు మహాభారతాన్ని రచించిన మహాకవి తిక్కన సోమయాజులు జన్మస్థలం. పట్టుచీరల తయారీలో పాటూరు నేతన్నలకు సైతం ప్రత్యేక గుర్తింపు ఉంది. గత కొన్ని సంవత్సరాల క్రితం చేనేత, పట్టు పరిశ్రమ కుదేలై నేతన్నలు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం వాటిని అధిగమించి కష్టానికి తగిన ప్రతిఫలంతో ముందుకు సాగుతున్నారు.



చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పాటూరు ప్రత్యేకం

పాటూరు చీరల తయారీలో యంత్రాలను ఉపయోగించకపోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. పూర్తిగా చేతి పని వారితోనే చీరలను రూపొందిస్తారు. ఎంతో తేలిగ్గా, మన్నికతో కూడుకున్నవి కావడంతో పాటు మధ్య తరగతి మహిళలకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ ధరల్లో లభ్యమవుతాయి. మహిళలకు సౌకర్యవంతంగా ఉండడంతో వీటిపై మక్కువ చూపుతున్నారు. ఇక్కడ కేవలం రూ.1600కే నాణ్యమైన పట్టు చీర లభించడంతో పాటు రూ.10 వేల ఖరీదైన చీరలు సైతం అందుబాటులో ఉంటాయి. దారాల నాణ్యత ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోనివిగా పాటూరు చీరలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పట్టుచీరల తయారీలో దేశంలోనే ప్రత్యేక స్థానం ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి పాటూరుకు మహిళలు వచ్చి చీరలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. ఇక్కడి చీరలకు గిరాకీ పెరగడంతో నేతన్నలకు చేతి నిండా పని ఉంది.

వెయ్యి కుటుంబాలకు ఉపాధి

పాటూరు పట్టు చీరలను పూర్తిగా చేతి పనివారితో తయారు చేయించడం వల్ల గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని వెయ్యి కుటుంబాలకు ఉపాధి లభ్యమవుతోంది. మగ్గం నేయడం, రాట్నం తిప్పడం, కండీలు చేయడం, నేయడం తదితర పనుల ద్వారా ఉపాధి కలుగుతోంది.

వ్యాపారులకు లాభదాయకం

చీరలు తయారు చేయించి విక్రయించే వ్యాపారులకు ఇక్కడ లాభదాయకంగా ఉంది. కాలంతో పని లేకుండా ఇక్కడి చీరలకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుండడంతో విక్రయాలు భేషుగ్గా ఉంటున్నాయి.

నేతన్న నేస్తం ఆసరా



రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న నేతన్న నేస్తం పథకం కింద ఇచ్చే రూ.24 వేలు ఎంతో ఆసరాగా ఉంటోంది. ఎక్కువ పని వారితో ఎక్కువ చీరలు తయారు చేసి విక్రయించే వ్యాపారులు లాభదాయకంగా ఉన్నప్పటికీ, తక్కువ పని వారితో తక్కువ చీరలు నేసి అమ్మేవారికి వ్యాపారం మందగించినప్పుడు నేతన్న నేస్తం జీవనోపాధికి ఉపకరిస్తోంది. ఈ పథకం ద్వారా నేతన్నలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాం.

–గుంటూరు లక్ష్మి, పాటూరు, కోవూరు మండలం

చేతి పని వారికి ఉపాధి..



నేత పని లేక, ఇతర పనులకు వెళ్లలేక ఇబ్బందిపడే పరిస్థితుల నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు చీరల తయారీ దోహద పడుతోంది. చీరల వ్యాపారం బాగుండడం వల్లే నేత పని తెలిసిన ప్రతిఒక్కరికీ పని కల్పించి ఆదుకొంటున్నాం. కేవలం పాటూరు చీరల తయారీపైనే ఆధార పడి వెయ్యి కుటుంబాలకు పైగా జీవిస్తున్నాయి. ఇంత మందికి ఉపాధి కల్పిస్తుండడం ఎంతో సంతృప్తినిస్తోంది.

–పెండెం వెంకటశేషయ్య, చీరల వ్యాపారి, పాటూరు

లాభదాయకం..



పాటూరు చీరలకు మంచి గిరాకీ ఉండడం వల్ల వ్యాపారం సవ్యంగా సాగుతోంది. ఇక్కడి చీరలకు ప్రత్యేక గుర్తింపు ఉన్నందువల్లే ఇతర రాష్ట్రాల వారు చీరల కొనుగోలుకు ఇక్కడకు వస్తున్నారు. ఫలితంగా వ్యాపారాలు బాగా సాగుతూ లాభదాయకంగా ఉన్నాం.

–పెండెం వెంకటేశ్వర్లు, చీరల వ్యాపారి,పాటూరు

న్యూస్‌రీల్

టిడ్కో గృహాలపై కమిషనర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాలపై కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్‌మర్మత్ సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. టిడ్కో గృహ నిర్మాణాల పురోగతి, జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన, తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. త్వరతిగతిన పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఈలు హరిగోపాల్, దయాకర్, హౌసింగ్ విభాగం అధికారులు సిద్ధిఖ్, సందీప్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న వైద్యసిబ్బంది

నెల్లూరు(అర్బన్): యోగా సాధన ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందాన్ని ఇస్తుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం సంతపేటలోని డీఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆరోగ్యమేళాలో భాగంగా యోగాపై శిక్షణ ఇచ్చారు. డీఎంఅండ్ హెచ్‌ఓ పెంచలయ్యతో పాటు పలువురు అధికారులు, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధనతో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలు దరిచేరవన్నారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. పనిఒత్తిడి ఉండే ఉద్యోగులకు యోగా చక్కటి ఔషధమన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఎపిడిమాలజిస్టు, డీఐఓ పాల్గొన్నారు.

ఆరోగ్య, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్ , జేసీ కూర్మనాథ్

నెల్లూరు (అర్బన్): ఆరోగ్యం, ఇతర అభివృద్ధి పనుల్లో సుస్థిర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఆయన అమరావతి నుంచి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్‌తో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గర్భిణులకు ప్రతినెలా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తక్కువ బరువు కలిగిన ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కోవిడ్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఫీవర్ సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఈఓ గంగాభవానీ, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

నుడాను కొల్లగొట్టారు!

- టీడీపీ హయాంలో అక్రమ లేఅవుట్లకు ఆజ్యం
- రెండేళ్ల కాలంలో 13 లేఅవుట్లకే అనుమతులు
- అనధికార లేఅవుట్ల ద్వారా పచ్చనేతల అక్రమార్జన
- వైఎస్సార్‌సీపీ పాలనలో నుడా ఆదాయం పరుగు
- మూడేళ్ల కాలంలో 105 లేఅవుట్లకు అప్రూవల్
- నుడా ద్వారా రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ హయాంలో ఏర్పాటైన నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ(నుడా)ను అప్పట్లో ఆ పార్టీ నేతలు తమ జేబులు నింపే సంస్థగా మార్చుకున్నారు. టీడీపీ పాలనలో రెండేళ్ల కాలంలో అవినీతి, అక్రమాలను ప్రోత్సహించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి సొంత ఆదాయాలను పెంచుకున్నారు. నుడా పరిధిలో అక్రమ లేఅవుట్ల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్న పచ్చనేతలు ప్రస్తుతం అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు చేస్తుండడం గురివింద సామెత గుర్తొస్తోందని జిల్లా ప్రజలు ఛీదరించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో నుడాలోని అక్రమాలకు చెక్‌పెట్టే దిశగా అడుగులు వేయడంతోపాటు ఆదాయ వనరులను పెంపొందించి అభివృద్ధి బాటలు వేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2017 మార్చి 24న నెల్లూరు నగర పాలక సంస్థ, కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలతో పాటు 21 మండలాలు, 156 గ్రామాలను కలిపి నుడాను ఏర్పాటు చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియామకం చేసింది. ఆపై నుడాను దాదాపు రెండేళ్ల కాలంలో పచ్చనేతల అక్రమాలకు అడ్డాగా మార్చేశారు. అనధికార లేఅవుట్లను ప్రోత్సహించి ఎకరాకు రేటు నిర్ణయించి వసూలు చేసుకున్నారు. టీడీపీ హయాంలో నుడా పరిధిలో ఎక్కడా అభివృద్ధి పనుల ఊసేలేదు. కేవలం సొంత వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తూ జేబులు నింపుకొన్నారు. రెండేళ్ల కాలంలో కేవలం 13 లేఅవుట్లకు గానూ 148 ఎకరాలకు మాత్రమే అనుమతులు ఇచ్చారు. అప్పట్లో దాదాపు 220కు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించినా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అప్పట్లో నుడా చైర్మన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రైవేట్ బృందాన్ని ఏర్పాటు చేసుకుని అనధికార లేఅవుట్ల వద్ద ఎకరాకు రూ.2 లక్షల వంతున వసూలు చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ రెండేళ్ల కాలంలో లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతుల ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.3 కోట్లు మాత్రమే రాబడి వచ్చింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే అవినీతి ఏ మేరకు జరిగిందో తేటతెల్లమవుతుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నుడాలో అక్రమాలకు చెక్ పెట్టేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. తద్వారా ఆదాయం పెంచుకోవడంతో పాటు అభివృద్ధి వేగవంతమైంది. గత మూడేళ్ల కాలంలో నుడా పరిధి పెంచడంతో పాటు 105 లేఅవుట్లకు గానూ దాదాపు 1140 ఎకరాలకు అనుమతులు ఇవ్వడంతో ఆదాయం పెరిగింది. భవన నిర్మాణ అనుమతులతో పాటు అప్రూవల్ లేఅవుట్ల ద్వారా ప్రభుత్వానికి రూ.25 కోట్ల మేర ఆదాయం చేకూరింది.

అభివృద్ధి పనులు వేగవంతం

నుడా పరిధిలో ఆదాయ వనరులు పెంపొందించుకోవడంతో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. దాదాపు రూ.40 కోట్ల వ్యయంతో నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు పట్టణాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. పచ్చదనం కోసం మొక్కల పెంపకం చేపట్టారు.

టీడీపీలోకి అక్రమార్కులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నుడా పరిధిలో ఆదాయవనరులు పెంపొందించే దిశగా అడుగులు పడ్డాయి. కానీ నెల్లూరు రూరల్ పరిధిలో మాత్రం అనధికార లేఅవుట్లకు స్థానిక ప్రజాప్రతినిధి ఆజ్యం పోశారు. ప్రస్తుతం నుడా పరిధిలో గుర్తించిన 118 అనధికార లేఅవుట్లకు నెల్లూరు రూరల్ పరిధిలోనే దాదాపు 80 శాతం వరకు ఉన్నాయి. ప్రతి లేఅవుట్‌లో వసూళ్లు భారీగా చేసుకున్నారు. ఎకరాకు రూ.లక్షల్లో వసూలు చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి సోమిరెడ్డి నుడా పరిధిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రకటన చేయడంపై ఆ పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనధికార లేఅవుట్లను ప్రోత్సహించి కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి సొంత ఆదాయాలు పెంచుకున్న వారినే పార్టీలోకి ఆహ్వానిస్తూ అధికార పక్షంపై విమర్శలు చేయడం సిగ్గుచేటుగా ఉందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

పేదరికాన్ని జయించేది చదువే



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్న విధంగా పేదరికాన్ని జయించేది చదువేనని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని కలెక్టర్ మాట్లాడారు. కటిక పేదరికంలో పుట్టి చదువు అనే ఆయుధంతో ప్రపంచ ఖ్యాతిని గడించిన మేధావి అంబేడ్కర్ అన్నారు. అలాంటి మేధావి ప్రజలందరూ సమాన హక్కులు పొందాలనే ఉద్దేశంతో భారత రాజ్యాంగాన్ని రాశారన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. జేసీ కూర్మనాథ్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాతని పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి

నెల్లూరు(సెంట్రల్): అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు.



బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

నెల్లూరు(సెంట్రల్): దేశంలోని అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీ పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎం సుధీర్‌కుమార్‌రెడ్డి, మొయిళ్ల గౌరి, పందింటి కామరాజు, ముత్యంగౌడ్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నేత్రపర్వం.. సంగమేశ్వరుని కల్యాణం

- పోటెత్తిన భక్తజనం



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : మండల పరిధిలోని కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కామాక్షితాయి, సంగమేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. మనుబోలు మండలం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆదిదంపతుల కల్యాణాన్ని తిలకించారు. రేబాల సుజన్‌కుమార్‌రెడ్డి, రజిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మనుబోలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పలువురు దాతలు మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మనుబోలు ఎస్సై ముత్యాలరావు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కాకాణి

సంగమేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నూతన దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయ అర్చకులు కాకాణికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సంగమేశ్వరుని దంపతులకు శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు సమర్పించారు.

వైభవంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. సుమారు 30 అడుగుల ఎత్తున్న రథాన్ని భక్తులు భుజాలపై మోస్తూ మనుబోలు శివాలయం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయం వరకు ఉత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం సాయంత్రం నూతన దంపతులకు కండలేరు జలాలతో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి రథాన్ని తిరిగి మనుబోలు శివాలయానికి తీసుకొచ్చారు. వేలాదిగా భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



హాజరైన భక్తజన సందోహం

మెట్టలో ఉద్యాన సిరులు

- కూరగాయల సాగుపై రైతుల మక్కువ
- విక్రయాలతో పాటు ఎగుమతులూ ఎక్కువే
- మెట్ట ప్రాంతాల్లోనే అధికంగా సాగు

నెల్లూరు(సెంట్రల్) : వ్యవసాయానికి సింహపురి పెట్టింది పేరు. ప్రధానంగా ఇక్కడ వరిని అధికంగా సాగు చేస్తారు. అయితే కూరగాయల సాగుతో కూడా జిల్లా ముందంజలో ఉంది. వివిధ రకాల పంటలను వేస్తూ జిల్లాలో విక్రయాలే కాకుండా ఇతర జిల్లాలకు కూడా ఎగుమతులు చేస్తుండడం విశేషం. కరోనా సమయం నుంచి కూరగాయల సాగుపై రైతులు ఎక్కువ దృష్టి సారిస్తున్నట్లు అధికారులు కూడా చెప్పుకొస్తున్నారు.

జిల్లా పరిధిలో..

ప్రస్తుతం జిల్లాలో 8 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటితో పాటు వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, కలువాయి, రాపూరు మండలాలు కూడా జిల్లా పరిధిలో ఉన్నాయి. వీటిలో నెల్లూరు నగరం మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో కూరగాయల సాగు జరుగుతున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు గుర్తించారు. దాదాపుగా 8 వేల ఎకరాలకు పైగానే రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. వీటిలో అధికంగా 3 వేల ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు చేస్తుండడం గమనార్హం. పచ్చిమిర్చి ఏడాదికి 86 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తోంది.

ఆయా ప్రాంతాల్లోనే ఎక్కువగా..

కూరగాయల సాగు కలిగిరి, వింజమూరు, కలువాయి, పొదలకూరు, రాపూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కందుకూరు, కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాల్లో ఎక్కువగా వివిధ రకాల కూరగాయల సాగు చేస్తున్నారు. ఎక్కువగా బెండ కాయలు, వంగ, సొరకాయలు, బీర, ఆకు కూరలు, కాకర, కూర అరటికాయ, పచ్చిమిర్చిలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

జిల్లాలో పండించిన వివిధ రకాల కూరగాయలను చెన్నై పరిధిలోని గుమ్మిడిపూడి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోని మార్కెట్‌కు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. నిత్యం దాదాపుగా 5 నుంచి 6 మినీ లారీల వరకు ఎగుమతులు చేస్తుంటారు. దాదాపుగా నిత్యం 300 మెట్రిక్ టన్నుల వరకు జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా నెల్లూరులోని ప్రధాన కూరగాయల మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. కాగా ఏడాదికి దాదాపుగా 1.27 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కూరగాయల దిగుబడి వస్తోంది.

విక్రయాలు ఇలా..

నెల్లూరులోని ప్రధాన కూరగాయల మార్కెట్‌కు జిల్లా నుంచి వివిధ రకాల కూరగాయలు దిగుబడి చేస్తుంటారు. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి కూడా నిత్యం తొమ్మిది వేల కేజీల వరకు కూరగాయలు మార్కెట్‌కు దిగుబడి రాగా, అందులో దాదాపుగా ఏడు వేల కేజీల వరకు నిత్యం విక్రయాలు చేస్తున్నారు. కాగా జిల్లాలో కూరగాయల విక్రయాలు అధికంగానే ఉంది.


సాగులో ఉన్న బీరతోట


కూరగాయల పంటను పరిశీలిస్తున్న అధికారులు

కూరగాయల సాగు ఎక్కువే



జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కూరగాయల సాగు ఎక్కువగానే ఉంది. కాగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ పథకాల విషయంలో కూడా ఎక్కడా సమస్యలు రాకుండా అందజేస్తున్నాం. అదేవిధంగా ఎప్పటికప్పుడు ఉద్యాన శాఖ అధికారులు సంబంధిత రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

– సుబ్బారెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

జిల్లాలో..

సాగు విస్తీర్ణం	- 8 వేల ఎకరాల్లో
దిగుబడి ఏడాదికి	- 1.27 లక్షల మె.ట.
విక్రయాలు	- 7 వేల కేజీలు
రైతుల సంఖ్య	- 2,100 (దాదాపు)
అధికంగా సాగు జరిగేది	- పచ్చిమిర్చి
అత్యల్పంగా	- క్యాబేజీ

క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ


మంత్రి కాకాణితో వేమిరెడ్డి, ఆదాల

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు.

– నెల్లూరు(సెంట్రల్)

దార్శనికుడు బాబాసాహెబ్


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్) : బాబాసాహెబ్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విప్లవాత్మక మార్పులకు అంబేడ్కర్ శ్రీకారం చుట్టారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు గాంధీ, ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యంతో అగ్నిప్రమాదాలకు చెక్

- డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు(క్రైమ్) : ప్రజలను చైతన్యవంతులు చేయడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు, వరదలు, విపత్తుల సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను కాపాడటంలో ముందుంటారని కొనియాడారు. ఎక్కువగా అగ్నిప్రమాదాలు అజాగ్రత్త వల్లే సంభవిస్తాయని, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే చాలా వరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు అన్నివర్గాల ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అగ్నిప్రమాద నివారణ చర్యలపై కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాకు నూతనంగా కేటాయించిన ఐఆర్బీ బోట్లు, ఫైర్‌బుల్లెట్‌లను ప్రారంభించారు. తొలుత విధి నిర్వహణలో అశువులు బాసిన అగ్నిమాపక సిబ్బందికి ఎమ్మెల్యేతో పాటు అగ్నిమాపక అధికారులు, సిబ్బంది నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి జిల్లా అగ్నిమాపక కార్యాలయం వరకు 2కే రన్ నిర్వహించారు.


బోట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

భూముల రీసర్వేను పూర్తి చేయాలి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (అర్బన్) : జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద ఎంపిక చేసిన 118 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సర్వే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో రీసర్వే పురోగతిపై జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు డివిజన్లలో మొదటి విడత రీసర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా గ్రామ, భూ హద్దుల నిర్ధారణ, వివరాల సేకరణ, భూహక్కు పత్రాలు, హద్దు రాళ్ల నాటడం తదితర అంశాలు పక్కాగా జరగాలన్నారు. కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, సర్వే, ల్యాండ్ రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, ఆర్డీఓలు మలోలా, కరుణకుమారి, శీనానాయక్ పాల్గొన్నారు.



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30



పేటీఎం ఏజెంట్‌పై దాబా యజమాని గూండాయిజం

కావలి: పట్టణంలోని ఓ ఫ్యామిలీ దాబా యజమాని పేటీఎం ఏజెంట్‌పై గూండాయిజం ప్రదర్శించాడు. బాధితుడు కావలి టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మద్దూరుపాడు జాతీయ రహదారి వద్ద దాబా హోటల్ ఉంది. ఆ బ్రాంచ్‌ను యజమాని కృష్ణారెడ్డి కుమారుడు సాయి పర్యవేక్షిస్తుంటాడు. పాతూరుకు చెందిన శ్రీనివాసులుయాదవ్ పేటీఎం సంస్థలో ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. మద్దూరుపాడు వద్ద ఉన్న దాబాలో నగదు చెల్లింపుల కోసం పేటీఎం స్కానర్‌ను సమకూర్చడానికి శ్రీనివాసులుయాదవ్ వెళ్లినప్పుడు సాయి తనకు పేటీఎం ద్వారా రుణం కావాలని అడిగితే రూ.8 లక్షలు మంజూరు చేయించాడు. ఇందుకు ప్రతిరోజూ రూ.1,194 చెల్లిస్తున్నాడు. అయితే దాబాను ఇతరులకు లీజుకు ఇవ్వడంతో జనవరి నుంచి రుణం తాలూకా చెల్లింపులు ఆపేశాడు. ఇంకా రూ.3.50 లక్షల బకాయిలు పెండింగ్ ఉంది. ఈ విషయంపై పలుమార్లు సాయిని శ్రీనివాసులు యాదవ్ అడుగుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయి తండ్రి కృష్ణారెడ్డి బాధితుడికి ఫోన్ చేసి పిలిచి రూంలోకి తీసుకెళ్లి కొట్టి, మోకాళ్లపై కూర్చోబెట్టాడు. అతనితో బలవంతంగా రూ.4.90 లక్షలకు ప్రామిసరీ నోటు రాయించుకున్నాడు. అతని సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని కూడా తీసుకుని చంపేస్తా.. దిక్కున్న చోట చెప్పుకో అంటూ బయటకు నెట్టేశాడు. దీంతో బాధితుడు కావలి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై సీఐ శ్రీనివాసరావును వివరణ అడగ్గా ఈ కేసు తన దృష్టికి రాలేదని చెప్పారు.

దర్గా అభివృద్ధికి లైన్ క్లియర్

- ఆదాల చొరవతో

రూ.15 కోట్లు మంజూరు

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గంలోని బారాషహీద్ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ శుక్రవారం జీఓను విడుదల చేసింది. ముస్లిం మైనార్టీల కోసం దర్గాను మరింత అభివృద్ధి చేయాల్సిందిగా నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన రూ.15 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో ముస్లిం నేతలు, మతపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వరుస క్రమంలో నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు.

ఐజీగా పాలరాజు బాధ్యతల స్వీకరణ




నగరంపాలెం : నగరంలోని ఐజీ కార్యాలయంలో గుంటూరు రేంజ్ ఐజీగా జి.పాలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న పాలరాజును గుంటూరు ఐజీగా బదిలీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన బాధ్యత స్వీకరించి, మాట్లాడారు. గతంలో నెల్లూరు జిల్లా విజిలెన్స్‌లో, డీజీపీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ సర్వీసెస్, దిశలో విధులు నిర్వర్తించినట్లు తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

లింగసముద్రం : ఎనిమిదేళ్ల బాలికపై ఇంటర్మీడియట్ చదువుతున్న బాలుడు లైంగికదాడి యత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు.. ఎనిమిదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్లి వస్తుండగా అదే ప్రాంతానికి చెందిన బాలుడు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. దీంతో బాలుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

కుమార్తె జాడ తెలపండి


తస్లీమ

నెల్లూరు(బారకాసు) : అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తె తస్లీమ ఈనెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని, తన జాడ తెలపాలని నగర పరిధిలోని పెద్ద చెరుకూరు ప్రాంతానికి చెందిన ఎస్కే కరిముల్లా, అములు ఆవేదన చెందారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ కుమార్తె తస్లీమ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం చేయిస్తున్నామన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 99487 47175 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.122
లేయర్ (లైవ్)	: రూ.75
బ్రాయిలర్ చికెన్	: రూ.214
స్కిన్‌లెస్ చికెన్	: రూ.238
లేయర్ చికెన్	: రూ.128



చికెన్ వ్యర్థాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం : చికెన్ వ్యర్థాలతో ఉన్న రెండు వాహనాలను మత్స్యశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మత్స్యశాఖ ఏడీ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని రేబాలలో ఒక లారీ, మినీ వ్యాన్ ద్వారా దాదాపు 44 డ్రమ్ముల వ్యర్థాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.